

ఎదురుచూపులే..!

- ఉమ్మడి జిల్లాలో 2645 ఉపాధ్యాయ పోస్టులు - అమలుకాని తొలి సంతకం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఐదేళ్లుగా డిఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం రోజు మెగా డిఎస్సీపై తొలి సంతకం చేశారు. సిఎం తొలి హామీ అమలు కాకపోవడంతో డిఎస్సీ అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు...

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. దీంతో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలోని 2,645 ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం ప్రకటించింది. ఎస్‌జిటి 1791, ఎస్ఎ తెలుగు 84 పోస్టులను, ఎస్ఎ హిందీ 113 పోస్టులను, ఎస్ఎ ఇంగ్లీష్ 61, ఎస్ఎ గణితం 89, ఎస్ఎ భౌతిక శాస్త్రం 63, ఎస్ఎ జీవ శాస్త్రం 61, ఎస్ఎ సాంఘిక శాస్త్రం 78, పిఇటి 211 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. చంద్రబాబు తొలి సంతకంపై తొలి సంతకం చేసి ఎనిమిది నెలలైనా మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో డిఎస్సీ అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

వైసిపి ప్రభుత్వం ఇచ్చిన డిఎస్సీకి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్‌జిటి పోస్టులకు 19వేల మంది, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదివేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో డిఎడ్, బిఎడ్ అయిపోయి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులుగా అభ్యర్థులు ఉండే లక్ష మంది ఉన్నారు. కానీ పోస్టులు, పరీక్షపై ఉన్న గందరగోళం, డిఎస్సీ జరుగుతాదో లేదో అనే అనుమానంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి ప్రభుత్వం చేపట్టే డిఎస్సీ ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి



గతంలో పార్లమెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రకటించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 39,008 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిఒ 117 రద్దు చేస్తే మొత్తం 50 వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతుంది. కాబట్టి తక్షణమే పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి. మొదట దఫా డిఎస్సీలో 25 వేల పోస్టులను భర్తీ చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాలకు తగ్గించాలి. ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి. మధ్యలోనే ఆగిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం చర్యలు తీసుకొని హోం శాఖలో ఖాళీగా ఉన్న 24 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.8వేలు చెల్లించాలి.

- వై.నగేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి.

దేశంలోనే అగ్రగామిగా గ్రీన్‌కో

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రీన్‌కో విద్యుత్ ఉత్పత్తి దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని కేంద్ర కన్స్యూమర్స్ అఫైర్స్, ఫుడ్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, రెన్యువబుల్ ఎనర్జీ మంత్రివర్యులు ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఓర్వకల్లులో మండలంలోని ఘని, గ్రీన్ కో ప్రాజెక్టులను శుక్రవారం ఏరియల్ సర్వే, ప్రత్యక్షంగా ఆయన పరిశీలించారు. అప్పర్ ఇన్‌టేక్ పాయింట్ రిజర్వాయర్ నుండి పైపుల ద్వారా నీటిని టర్బైన్ వరకూ సరఫరా చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ అంటే తెలీని వారికి తమ ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. పిఎం సూర్యగర్ పథకం ద్వారా పేదలు తక్కువ ఛార్జీలకే విద్యుత్ వినియోగించుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని, ఇది కేంద్ర ప్రభుత్వం పని చేసే విధానమని చెప్పారు. గ్రీన్‌కో ప్రాజెక్టు వల్ల తను చాలా గర్వంగా, సంతోషంగా ఉన్నానన్నారు. ఇది ఒక ప్రత్యేకమైన ప్రాజెక్టు అని, ఒకసారి వాడిన నీటితో మళ్లీ విద్యుత్ ఉత్పత్తి చేయడం చాలా మంచి విధానం అన్నారు. ఈ విధమైన ఆలోచనలు మరియు యూనిక్ ప్రాజెక్టు వల్ల దేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇటువంటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వము ఆహ్వానిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు 60 సంవత్సరాలకు పైగా పనిచేసే సామర్థ్యం ఉందని, ఈ ప్రాజెక్టు అతి త్వరలో పూర్తి సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. కేవలం సోలార్ విద్యుత్ పైనే ఆధారపడి ఉండకూడదని ప్రత్యామ్నాయంగా గాలి విద్యుత్తు, నీటి విద్యుత్తును వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. గ్రీన్ కో హైడ్రోజన్ పవర్, గ్రీన్ అమోనియా ప్రాజెక్టులపై పనిచేస్తోందని, దేశంలోని 20 రాష్ట్రాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రితో పాటు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, చిక్బళ్లాపూర్ ఎంపీ జి.సుధాకర్ రెడ్డి, గ్రీన్ కో మేనేజింగ్ డైరెక్టర్ చలమల శెట్టి అనిల్ కుమార్, కర్నూల్ ఆర్డీఓ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- ఉపవాసంతో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఏసు క్రీస్తు సిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరంలోని అన్ని చర్చిలలో క్రీస్తు సిలువ లో పలికిన చివరి మాటల ధ్యాన కూడికలు జరిగాయి. ఇందులో భాగంగా స్థానిక ఆర్ ఎస్ కూడలి లోని యెహోవా షమ్మా చర్చిలో ప్రధాన సంఘ కాపరి డాక్టర్ బి స్టీఫెన్ చార్లెస్, డాక్టర్ ఆర్ ప్రశాంతి శ్యామ్, పాస్టర్ జీవన్ ప్రతాప్‌లు క్రీస్తు సిలువలో పలికిన చివరి మాటలలోని ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. గాయక బృందం జయంతి, కల్యాణి, కేతుర,దివ్య తేజ, దివ్య, ఝాన్సి, సౌజన్య, సుధారాణి, రేఖ, హెప్సి కుమారి, ప్రమీల క్రీస్తు సిలువ శ్రమల గీతాలను అద్భుతంగా ఆలపించారు. జశరీరమంతా నలుగ గొట్టబడి రక్తం కారుతున్నా తల్లి పట్ల తనకున్న ప్రేమను, బాధ్యతను యేసుక్రీస్తు మరువలేదనీ, తల్లి బాధ్యతను తన శిష్యులలో ఒకరికి అప్పగించి మనకందరికీ మాదిరి అయ్యాడని, మనము కూడా క్రీస్తును మాదిరిగా చేసుకొని తల్లిదండ్రులను ప్రేమించాలని డాక్టర్ ఆర్. ప్రశాంతి శ్యామ్ అన్నారు. అదే విధంగా సి క్యాంప్ కూడలిలోని ప్రార్థనా మందిరం చర్చిలో పాస్టర్ గంటా కరుణ సాగర్, సీసీ చర్చిలో పాస్టర్ అనిల్ సామెల్, పాస్టర్ జీవన్ రావు, సిఎస్ఐ చర్చిలో పాస్టర్ వర ప్రసాదరావు, థియోడర్ జేకబ్, స్టాంటన్ మెమోరియల్ చర్చిలో పాస్టర్ దేవసహాయం, పాస్టర్ విక్టర్ ఇమ్మానుయేలు, హెూసన్నా మందిరంలో పాస్టర్ ఫ్రెడ్డి పాల్ తదితరులు క్రీస్తు సిలువలో పలికిన చివరి మాటలను గురించి వివరించారు. జగన్నాథగట్టు వద్ద ఉన్న రేమా గ్లోబల్ చర్చిలో పాస్టర్లు ప్రమోద్ జాషువా, సందీప్ శాంసన్, బ్లెస్సీ మనోహర్ వాక్యోపదేశం చేశారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



వాక్య సందేశం ఇస్తున్న డాక్టర్ ఆర్.ప్రశాంతి శ్యామ్



యెహోవా షమ్మా చర్చిలో పాటలు పాడుతున్న గాయకులు



కౌతాళంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ముస్లింలు

ఐకమత్యంతో కేంద్రం మెడలు వంచుదాం

- ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ - వక్ఫ్ సవరణ బిల్లు రద్దుకు ఉద్యమించిన ముస్లింలు

ప్రజాశక్తి - కౌతాళం

ఐకమత్యంతో కేంద్రం మెడలు వంచుదామని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కౌతాళంలో భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించి ముస్లింలు ఉద్యమించారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం కౌతాళం మండలం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కౌతాళంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ముస్లింలు, వామపక్షాలు, రైతు కూలీ సంఘం, జై భీమ్, దళిత సమైఖ్య, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసనలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సందర్భంగా శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్, పీఠాధిపతి ఖాదర్ బాషా సాహెబ్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, జై భీమ్ కౌతాళం నాయకులు అవతారం, పాల్ దినకరన్, వీరేష్, జైపాల్, సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, సిపిఐ నాయకులు ఈరన్న, దళిత సమైఖ్య నాయకులు విజయకుమార్, ఆవాజ్ కమిటీ నాయకులు ఖాజా హుస్సేన్, గౌస్ మహ్మద్ మాట్లాడారు. దేశంలో రామరాజ్యం పేరుతో రాక్షసులు నరేంద్ర మోడీ, అమిత్ షా రాజ్యమేలుతున్నారని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి అన్నదమ్ముల్లాగా ఉన్న హిందు, ముస్లింల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ చట్టం వల్ల దేశ సమగ్రతకు, ఐక్యతకు భంగం వాటిల్లుతుందని, లౌకికవాదం పూర్తిగా నశిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిని వ్యతిరేకించాలని కోరారు. వక్ఫ్ బోర్డు కమిటీల్లో ముస్లిమేతరులను నియమించడానికి చట్టం సవరణ చేయడం ఏమిటని, హిందూ దేవాలయాల కమిటీల్లోనూ, రాష్ట్ర కమిటీలోనూ ముస్లింలకు, క్రైస్తవులకు, దళితులకు ప్రవేశం కల్పిస్తారా అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం వక్ఫ్ బోర్డు పరిధిలో దేశవ్యాప్తంగా ముస్లింల అభివృద్ధికి దాతలు ఇచ్చిన 9.50 లక్షల ఎకరాల భూమి ఉందని, దానిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, కార్పొరేట్ కంపెనీలకు పంచిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ముస్లింలకు అండగా ఉంటానని చెప్పి, బిజెపితో చేతులు కలిపి పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింల గొంతు కోశారని మండిపడ్డారు. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని, దేశంలోని లౌకిక వాదులైన హిందువులందరూ కలిసి రావాలని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా కౌతాళం, కోసిగి సిఐలు అశోక్ కుమార్, మంజునాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

కర్నూలు కార్పొరేషన్ : వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని సీపీఎం నేతలు ఎస్ఎండి షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండి బజార్ నుండి సిపిఎం పార్టీ నాయకులు ర్యాలీగా బయలుదేరి మాసూం భాష దర్గా, లాల్ మసీద్, బైగన్ పల్లి హోటల్ మీదుగా కెవిఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు, జమాతే ఇస్లామి ఏ హింద్ జిల్లా నాయకులు పీఎస్.మూనిర్ అహ్మద్, ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని బిజెపి పాలనపై వారు దుమ్మెత్తి పోశారు. ముస్లిం మైనార్టీల సంబంధించిన ఆస్తులపై ప్రభుత్వానికి ఎటువంటి హక్కు లేదని ఏ రకంగా ప్రభుత్వం తమ జోక్యాన్ని వక్ఫ్ బోర్డ్‌లో కల్పించుకుంటుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించిన విధంగా హిందూ దేవాలయాలలో ముస్లింలను కూడా సభ్యులుగా చేరుస్తారా అని ప్రశ్నించారు. బిజెపి ఆర్ఎస్ఎస్ విధానం మొదటి నుండి కూడా దళితులను, ముస్లిం మైనార్టీల ను అనగదొక్కాలనే వైఖరి చాలా స్పష్టంగ కనబడుతుందని తెలిపారు. ఈనెల 28న ఉస్మానియా కాలేజ్ గ్రౌండ్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని జెఎసి నిర్ణయించిందని, ర్యాలీలో ప్రజానీకం అందరు కూడా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పిపిఎస్ఎస్ మానవహారం



పిపిఎస్ఎస్ మానవహారంలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్నం హైవే రోడ్డు ప్రక్కన కర్నూలు కొత్త ఈద్గా ఎదుట జరిగిన మానవహారం లో పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ పేరుతో ముస్లింల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి, బడా పెట్టుబడిదారులకు కట్టబట్టేందుకు కుటీల ప్రయత్నం చేస్తుందని అన్నారు. ప్రజల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజ్యాన్ని ఏలుతున్న మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే వరకు అందరం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న అబ్దుల్ దేశాయ్



హంద్రీనీవా పనులలో నాణ్యత పాటించాలి

పనులను పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణ సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా సుజల స్రవంతి విస్తరణ పనులను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ పనులను నాణ్యత లోపం లేకుండా కాంట్రాక్టర్లపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నాణ్యత పాటించకుంటే భవిష్యత్తు పరిణామాలకు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు గోపాల్ నరసన్న , మధు తదితరులు పాల్గొన్నారు..

తుమ్మల మానవతావాది

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్



నివాళి అర్పిస్తున్న కల్కూర, హరికిషన్

కథానమయం ద్వారా తుమ్మల రామకృష్ణ అనేకమంది రచయితలను తీర్చిదిద్దారని, అంతేకాక గొప్ప సృజనకారుడని వక్తలు కొనియాడారు. శుక్రవారం రాత్రి కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో కథాసమయం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. డాక్టర్ హరికిషన్ సభాధ్యక్షత వహించారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, తుమ్మల రామకృష్ణ సోదరులు డాక్టర్ తుమ్మల శ్రీనివాస్, ప్రసిద్ధ కథారచయిత జి.ఉమామహేశ్వర్‌లు పూలమాలవేసి నివాళి అర్పించారు. సభలో తెలకపల్లి మధుసూధనశర్మ మాట్లాడుతూ తుమ్మల స్ఫూర్తితో కథరాసానని ఆయన గొప్ప మానవతావాది అన్నారు. కర్నూలు ఆయన సజనకు గొప్పవేదిక అయ్యిందని, చరిత్రలో నిలిచిపోయే కథలు రాశాడన్నారు. డాక్టర్ మద్దిలేటి మాట్లాడుతూ ఆయన కృషితో దళిత సాహిత్యంలో డాక్టరేట్ పొందానన్నారు. ప్రముఖకవి వెంకటకృష్ణ మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల పక్షాన నిలిచి గొప్ప కథలు రాశాడని, అందులో పల్లెమంగలి కథలన్నారు. సభలో సాహితీ స్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు, నంది అవార్డు గ్రహీత పత్తిఓబులయ్య, కవులు తెలుగు వెంకటేష్, కళ్యాణదుర్గం స్వర్ణలత, రచయితలు ఎస్‌డివి అజీజ్, మారుతి పౌరోహితం, డాక్టర్ చంద్రమౌళినీ, ఆధ్య మెడికల్ అధినేత అవిజ వెంకటేశ్వర రెడ్డి, డిటిఎఫ్ నాయకులు రత్నం యోసేపు, యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్ పాటి, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, సభలో ఎంపి బసవరాజు, మహమ్మద్ మియా పాటలు అలరించాయి.

ఈ-వ్యర్థాల పునర్వినియోగమే మానవాళికి రక్ష

మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



సమాజంలో పర్యావరణానికి ఎలక్ట్రానిక్-వ్యర్థాలు తీవ్ర హాని చేస్తున్నాయని, వాటిని పునర్వినియోగించడమే మానవాళి మనుగడకి రక్ష అని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ పొటి శ్రీరాములు చిల్డ్రన్స్ పార్కులో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రోజురోజుకు వినియోగం పెరుగుతూ, సమాజంలో ముంచెత్తుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తిస్థాయిలో పునశ్శుద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ-వ్యర్థాలను భూమిపైన, నీటిలో పడేస్తుండటంతో పర్యావరణానికి, మానవాళికి హాని కలుగుతోందని, వీటిని దహనం చేయడం వల్ల కర్బన ఉద్గారాలు విడుదలై ప్రకృతిపై, జనజీవనంపై దుష్ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. పాడైన టీవీలు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, మెమొరీ చిప్లను పారవేసినప్పుడు అందులోని భార లోహాలు వివిధ రసాయనాలను విడుదల చేస్తాయని, అవి భూగర్భ జలాలను విషపూరితం చేస్తున్నాయని పేర్కొన్నారు. కలుషిత రసాయనాలను పీల్చేవారు, కాలుష్య జలాలను తాగినవారు క్యాన్సర్, మెదడు, నాడీ వ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ-వ్యర్థాలను సేకరించి, వాటిల్లో అవసరమైనవాటిని ఉత్పాదక, పునర్వినియోగం, పునరుత్పాదక రంగాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా శనివారం నగరంలో అన్ని వార్డుల్లో ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, నగర ప్రజలు తమ గృహాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అందించాలని కోరారు. ఈ-వ్యర్థాల కేంద్రం కోసం స్థానిక సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లేదా స్థానిక సచివాలయ శానిటేషన్ సెక్రటరీని సంప్రదించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఈఈ పి.వి. కిషోర్ రెడ్డి, గ్రీన్ గ్లోబల్ రీసైక్లర్స్ ప్రతినిధులు పవన్, అలోక్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఐడి కార్డులు తీసుకోవాలి

నగరంలో వయో వృద్ధులు ఐడి కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 60 ఏళ్ళు పైబడిన పురుషులు, 50 ఏళ్ల పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్‌గా పరిగణిస్తారని, వారు తమ సచివాలయాల్లో ఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, రూ.40 రుసుం చెల్లిస్తే ఐడి కార్డు మంజూరు అవుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

ఐక్య పోరాటాలకు సిద్ధం కండి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వేర్ హౌస్ హమాలి యూనియన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం కార్మిక, కర్షక భవనం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి వేర్ హౌస్ హమాలి యూనియన్ అధ్యక్షులు విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ ఏపీ వేర్ హౌస్ హమాలీ కార్మికులకు పని భద్రత కల్పించి, వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 50 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ వేర్ హౌస్ గోడౌన్లను నమ్ముకుని పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నా ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గం అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. మే 20న భారతదేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వేర్ హౌస్ హమాలీ యూనియన్ కార్యదర్శి ఎం.మల్లికార్జున, ఈ.విజయుడు, టి.కె.మధు, ఎం.పురుషోత్తం, కె.సుధాకర్, చిన్న మద్దిలేటి, చెన్నయ్య, ఇసాక్, శేఖర్, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు జబ్బు

- వేధిస్తున్న సమస్యలు
- నేడు ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన
- సమస్యలపై స్పందిస్తారా?

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఎంతోమంది రోగుల అనారోగ్యాలను కాపాడే కర్నూలు జిజిహెచ్‌కు జబ్బు చేసింది. అనేక సమస్యలతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సతమతమౌతోంది. దానిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం పర్యటించనున్నారు. జిజిహెచ్‌లో నెలకొన్న సమస్యలపై ఆయనైనా స్పందిస్తారని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.

నిలిచిన ఆస్పత్రి నిర్మాణాలు : రాయలసీమకే తల మాణికమైన జిజిహెచ్‌కు కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం జిల్లా నుండి, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ప్రతిరోజు నిత్యం 2 వేల నుంచి 3 వేల మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఇన్ పేషెంట్స్ వెయ్యి మంది దాకా ఉంటారు. పాతకాలం నాటి ఓపి, ఐపి, ఎమర్జెన్సీ, భవనాల స్థానంలో ఆధునికరణ పనులలో భాగంగా ఇన్ పేషెంట్ విభాగం (ఐపిడి బ్లాక్), అవుట్ పేషెంట్ విభాగం (ఓపిడి బ్లాక్), క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ, మెడికల్ కాలేజీ, హాస్పటల్ క్యాటిన్, లెక్చర్ గ్యాలరీ, ఆధునిక మార్చురీ, బయో మెడికల్ వేస్ట్, సెక్యూరిటీ కోసం రూ.500 కోట్లతో ఆధునిక భవనాల నిర్మాణ పనులను కెవిఎం కంపెనీ చేపట్టింది. జూలై 2025 నాటికి ఆధునిక భవనాల నిర్మాణం పూర్తి అయి రోగులకు అందుబాటులో రావలసి ఉండేది. కాని కాంట్రాక్టర్‌కు సుమారు రూ.17 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటం తో పనులు ఆగిపోయన్న విమర్శలు ఉన్నాయి. దీనితో సబ్ వే, గ్రౌండ్ ఫ్లోర్, నాలుగు అంతస్తుల భవనాలలో క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ మరియు 668 బెడ్స్‌తో నిర్మితం అవుతున్న వార్డుల అర్థతరంగా నిర్మాణాలు ఆగిపోయాయి. వీటి నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలో వుండే జిల్లా మంత్రి కాని, ప్రజాప్రతినిధులు కాని ఏమాత్రం దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అపరిశుభ్రత, స్ట్రక్చర్ల కొరత : జిజిహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ మరియు కొన్ని వార్డులలో అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. నిర్వహణ సరిగా ఉండడం లేదని, తక్కువ మంది సిబ్బందితో పని చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్యాజువాలిటీలో స్ట్రక్చర్స్, పడకల సమస్య ప్రధానంగా ఉన్నాయి. శుశ్రుత భవన్ దగ్గర ఉన్న రోగుల సహాయకుల కోసం ఏర్పాటుచేసిన సముదాయం అస్తవ్యస్తంగా తయారైంది. దాని ఎదురుగానే పందులు బురదలో పొర్లాడుతున్నాయి. రోగులు, సహాయకుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి.

సిబ్బందికి వేతనాలు పెండింగ్ : జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్లు, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎ1 ఫ్యాకల్టీ ఏజెన్సీ స్వీపర్లకు 4 నెలలు, ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ సెక్యూరిటీ గార్డులకు 3 నెలల జీతాలు, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.


నేలకొరిగిన వరి పంట

తుంగభద్ర తీరంలో గాలి వాన బీభత్సం

- తడిసి ముద్దయిన వరి పంట, ధాన్యం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం తుంగభద్ర నదీతీరంలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం భారీ వర్షం కురిసింది. మండలంలోని నదీచాగి, మేళిగనూరు, కుంబాల నూరు గ్రామాల్లో భారీగా కురిసిన వర్షానికి వరి పంట తడిసి ముద్దయింది. గాలి వాన బీభత్సానికి వరి పంట కోసి వేసుకున్న రైతుల కళ్ల ముందే తడిసిపోతున్నా ఏమీ చేయలేక నిస్సహాయులుగా చూస్తుండి పోయారు. రాశులుగా పోసుకున్న వరి ధాన్యంపైన టార్పాలిన్లు వేసినా గాలి బీభత్సానికి ఎగిరిపోయాయి. వరి కోత చేపట్టిన పొలాల్లో వరి పంట దాదాపు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంట అమ్ముకునేందుకు సరైన ధరలు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలుదారులు రాక కోసం ఎదురుచూస్తున్న సమయంలో అనుకోకుండా వచ్చిన వర్షం భారీ దెబ్బకొట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరి ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

ఉరుములు, మెరుపుల ధాటికి ఎద్దు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో ఉరుములు, మెరుపుల ధాటికి రైతు మహబూబ్ బాషాకు చెందిన ఎద్దు మృతి చెందింది. శుక్రవారం మధ్యాహ్నం భీకరమైన శబ్దం, గాలులతో పాటు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మహబూబ్ బాషా తన ఎద్దులను వామిదొడ్డిలో కట్టేశారు. వర్షం ఆగిన తర్వాత వెళ్లి చూడగా రెండు ఎద్దుల్లో ఒక ఎద్దు మృతి చెందింది. దాదాపు రూ.60 వేలు విలువ చేసే ఎద్దు చనిపోయిందని బాధిత రైతు వాపోయారు. రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.


మృతి చెందిన ఎద్దు

కమ్మరచేడులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని కమ్మర చేడు గ్రామంలో వెలసిన సుంకులమ్మ దేవాలయంలో గ్రామ పెద్దలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హరి పుష్పవతి, మల్లికార్జున రెడ్డి ఆహ్వానం మేరకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైసిపి నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. నాయకులు గిరి, శ్రీధర్ రెడ్డి, వీరభద్రా రెడ్డి పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- ఎస్ఐ కేశవ్

ప్రజాశక్తి - నందవరం

వాహనదారులు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని ఎస్ఐ కేశవ్ తెలిపారు. శుక్రవారం ధర్మాపురం టోల్‌గేట్ దగ్గర వాహనాల తనిఖీ చేపట్టారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, స్కూటర్లపై ప్రయాణించే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించని 11 మంది వాహన దారులకు రూ.2,035 చొప్పున జరిమాన విధించినట్లు తెలిపారు.


వాహనాల తనిఖీ చేపడుతున్న ఎస్ఐ కేశవ్

వేదవతి పూర్తయ్యే వరకు పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరు ప్రాంత జీవనాడి వేదవతి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలూరులోని జ్యోతిబసు భవనంలో సమావేశం నిర్వహించారు. ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎం వేదవతి ప్రాజెక్టు సాధనకు దశలవారీగా అనేక ఆందోళనలు చేపట్టామని, పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆలూరు ప్రాంతానికి సాగు, తాగునీరు కరువయ్యాయని మండిపడ్డారు. వెనుకబడిన ప్రాంతాల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఉచిత వాగ్దానం చేయడం తప్ప ఆలూరు ప్రాంత శాశ్వత కరువు నివారణకు ఈఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దీనికి నిదర్శనమని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టును ప్రారంభించి నిర్లక్ష్యంగా వదిలేసిందని, వైసిపి, టిడిపిలకు ఈ ప్రాంత ప్రజల ఓట్లు కావాలే తప్ప సంక్షేమం పట్టదని విమర్శించారు. ప్రజలకు సాగు, తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి ఆలూరు ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ, షాకీర్, మైనా, రత్నమ్మ, రాధమ్మ, విజయలక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు శీను, సుంకన్న, సూరి, హమాలీ సంఘం నాయకులు పరశురాం, వీరేష్, నరసింహులు, ఈరన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఉపాధి కూలీల సమస్యలు పట్టవా..?

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి హామీ కూలీల సమస్యలు అధికారులకు పట్టవా అని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి.రామాంజనేయులు ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని కుప్పగల్లు, పాండవగల్లు, ఆరెకల్లు, ఇస్వి, సంతేకుడ్లూరు, కడితోట తదితర గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశంలోకి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా వేసవిలో ఎండకు పనిచేస్తున్న కూలీలకు కనీసం టెంట్ సౌకర్యం, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని తెలిపారు. కూలీలకు సుమారు పది వారాలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలు పెట్టి ఫారంపాండ్స్ పనులు చేపట్టాలని తీవ్ర ఒత్తిడి చేస్తోందని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న ఆదోని ఎంపిడిఒ కార్యాలయం ముందు చేపట్టే ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని పలు క్రైస్తవ సంఘాలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విక్టోరియా పేట సిఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సుజిత్ విలియమ్స్ ఆధ్వర్యంలో ఎస్‌కెడి కాలనీలోని హోలీ ట్రినిటీ చర్చి పాస్టర్ రెవరెండ్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో, సియోను ప్రార్థన మందిరంలో దైవ సేవకులు ఆకెపోగు తిమోతి ఆధ్వర్యంలో, మహిమా ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రకాష్, బేరియా చర్చి, హోసన్న మందిరం, మండగిరి కతోలిక బాల ఏసు మందిరంలో కోలా విజయరాజు ఆధ్వర్యంలో, రాయ నగర్ ఎంబి మిస్పా చర్చి, యెరూషలేము చర్చిలో పాస్టర్ విక్టర్ పాల్ ఫిలిఫ్ ఆధ్వర్యంలో పలు క్రైస్తవ సంఘాలలో శుభ శుక్రవారం ప్రార్థనలకు భారీగా తరలి వచ్చారు. ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించుకున్నారు. మండగిరి కతోలిక బాల ఏసు మందిరం, సాంబగల్లు ఆర్‌సిఎం చర్చిలో సిలువ యాత్ర చేపట్టారు. క్రైస్తవులు సిలువను మోసి ప్రార్థనలు చేపట్టారు. విక్టోరియా పేట సిఎస్ఐ చర్చి పెద్దలు సునీల్ రాజ్ కుమార్, శ్రీకాంత్, హోలీ ట్రినిటీ చర్చి సంఘ కార్యదర్శి మేష డేవిడ్, ట్రెజరర్ ఎస్టీ విల్సన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కల్వరికొండ ఆనందరాజు వారి చర్చిలో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


ఆదోనిలో సిలువ యాత్ర చేస్తున్న ఫాదర్ కోలా విజయరాజ్

ఆదోనిని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యేపై మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫైర్
- సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిని అభివృద్ధి చేయాలని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ దీక్షకు కూర్చున్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద శిబిరం వద్దకు శుక్రవారం పలువురు చేరుకొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడో వ్యక్తి ఎమ్మెల్యే అయితే ఆదోని అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్మారని, వారి ఆశలను ఎమ్మెల్యే పార్థసారథి నెరవేర్చలేదని మండిపడ్డారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి కనుసన్నల్లోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఆధార్ మార్ఫింగ్‌తో బతికిన మనిషినే చనిపోయినట్లు ధ్రువీకరించి విలువైన స్థలాలు, రిజిస్ట్రేషన్ వంటి అక్రమాలు జరిగాయన్నారు. మామూళ్లు ఇవ్వాలని వాహనదారులపై బిజెపి నాయకులు బెదిరింపులకు పాల్పడితే నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారని తెలిపారు. ఆదోని అభివృద్ధిపై వెంటనే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు వైసిపి మహిళా నాయకులు శ్రీలక్ష్మి జిలేఖాజీ సంఘీభావం తెలిపారు.

సిపిఎం సంఘీభావం : పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ మాజీ చైర్మన్ దేవి శెట్టి ప్రకాష్ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సిపిఎం సంపూర్ణ మద్దతునిస్తుందని సిపిఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, ఈరన్న, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, హనీఫ్, శ్రీనివాసులు తెలిపారు. వారు దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఆదోనిలో పరిశ్రమలు లేక, ఉపాధి కరువై యువత సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. కేంద్రంలో పలుకుబడి ఉందని పదేపదే చెబుతున్న ఎమ్మెల్యే పార్థసారథి పది నెలల పాలనలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. మాటలు చాలించి చేతల్లో చూపించాలని హితవు పలికారు.

దేవిశెట్టికి దీక్షకు స్పందన : దేవిశెట్టి ప్రకాష్ చేపట్టిన దీక్షకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన పది నెలల్లోనే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి చెడ్డపేరు మూటగట్టుకోవడం శోచనీయమన్నారు. ఆదోనిలో అవినీతి పేరుకుపోయిందని విమర్శించే ఎమ్మెల్యే పార్థసారథి ఒక్క అవినీతి పరునిపై కూడా కేసు పెట్టకుండా, జైలుకు పంపకుండా వదిలివేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కర్ణాటక నుంచి ఆదోని మీదుగా వెళ్లే వాహనాలను ఆపి వేధించడం వల్ల ఆదోని చాలా చెడ్డ పేరు వచ్చిందని, మరి ఆదోనిని అభివృద్ధి చేస్తున్నారా లేక పాడు చేస్తున్నారో పునరాలోచించాలని సూచించారు. గత పాలకుల అవినీతిపై ఎన్నికల ప్రచారంలో దుమ్మెత్తి పోసిన ఎమ్మెల్యే పార్థసారథి వారిపై ఒక్క కేసు కూడా నమోదు పెట్టలేదని మండిపడ్డారు. దీనికి ఎమ్మెల్యే పార్థసారథి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేంద్ర యాదవ్, మహ్మద్, అస్లాం పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న దేవిశెట్టి ప్రకాష్


సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు


నగదు అందజేస్తున్న దాత

దేవాలయం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆదోని

పురాతన కోట చంద్రమౌళీశ్వర దేవాలయం అభివృద్ధికి విరాళాలు అందించే దాతలు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ రవి కోరారు. శుక్రవారం పట్టణానికి చెందిన రైల్వే ఈరన్న తన వంతుగా రూ.2 లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. గతంలో దేవాలయానికి ఎంతో ప్రతిష్ట ఉండేదని తెలిపారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. దాతల సహకారంతో పనులు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు హనుమంతు, మహేష్, గోవిందు, వెంకటేష్ ఉన్నారు.

నేడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 9 గంటలకు పాఠశాల వద్ద హాజరుకావాలని కోరారు. వారి పిల్లల అభివృద్ధి గురించి ఉపాధ్యాయులతో చర్చించి వారి భవిష్యత్తు పురోగతికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందవరం

మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమలగూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కేశవ్ వివరాల మేరకు... సోమలగూడూరు గ్రామానికి చెందిన మాల రాజు (39) తనకున్న 1.20 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసి అప్పుల పాలయ్యారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో విసుగు చెంది భార్య రంగమ్మ పుట్టింటికి వెళ్లారు. రాజు గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజు తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌విఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో జరిగే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని న్యూ సిటీ కార్యదర్శి సి.శేషాద్రి కోరారు. కర్నూలులోని వీరనారి ఐలమ్మ కార్యాలయంలో రాష్ట్ర మహాసభ బహిరంగ సభ కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. శేషాద్రి మాట్లాడుతూ రజక వృత్తిదారులు, రజక కార్మికులు, శ్రమ దోపిడీని భరించవలసి వస్తోందన్నారు. వారి సమస్యల పరిష్కారంకై రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఈనెల 20, 21వ తేదీలో జరుగు రాష్ట్ర మహాసభలను చర్చించి తగు కార్యాచరణ చేపడతామన్నారు. 20న మధ్యాహ్నం మూడు గంటలకు కొండపల్లిలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. న్యూ సిటీ గౌరవ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసులు, అధ్యక్షుడు సి.రాముడు, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మరియు నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషీ కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయాన్ని సందర్శించారు.. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి ఎంపీ ఆహ్వానం మేరకు నగరంలో ఉన్న కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషిని ఎంపీ నాగరాజు సన్మానించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేశారు. అనంతరం జిల్లాలోని పలు సమస్యలపై కేంద్ర మంత్రికి ఎంపీ నాగరాజు వినతిపత్రం సమర్పించారు.

ఫలించిన 30 ఏళ్ల పోరాటం

- ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ వర్గీకరణతో 30 ఏళ్ల పోరాటం ఫలించిందని ఎంఆర్‌పిఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆదోనిలో డప్పులు వాయిస్తూ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్ ఆదోని మండల ఇన్‌ఛార్జీ బండారి గిడ్డయ్య మాదిగ, పట్టణ కార్యదర్శి వన్నెల మణికంఠ మాదిగ, జిఎస్.దత్తు మాదిగ అధ్యక్షతన పట్టణంలోని భీమాస్ కూడలిలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి బండారి హనుమంతు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.బాలన్న మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి పిఎస్.వీరేష్ మాదిగ హాజరయ్యారు. తిమ్మారెడ్డి బస్టాండ్‌లో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడారు. 30 ఏళ్లు అలుపెరుగని పోరాటం చేసి నేడు ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు సాధించి పెట్టిన గొప్ప పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ అని, అలాంటి నాయకుని నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందని తెలిపారు. ఎంఇఎఫ్ నాయకులు ప్రేమ్ కుమార్ మాదిగ, పట్టణ మాజీ అధ్యక్షులు పిటి.రామన్న మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు హెబ్బటం జి.రాజు మాదిగ, పట్టణ మాజీ అధ్యక్షులు మాదాసు జగన్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి, సీనియర్ నాయకులు బండారి నాగరాజు, సద్దాం హుస్సేనప్ప, బైచికేరి తిమ్మన్న, టి.ఈరన్న, అనుముల నాగరాజు, రాజు, లాలప్ప, బండారి మారన్న, కౌడల్‌పేట్ ఎల్.గణేష్, సురేంద్ర, మదిరే తిమ్మన్న పాల్గొన్నారు. **ఆస్పరి**లోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయం నుంచి ఎంఆర్‌పిఎస్ జెండా కట్ట వరకు ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు చిన్న సంజన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా కాలి, ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి పెద్ద సంజప్ప మాదిగ, ఎంఎస్‌పి మండల కార్యదర్శి రామాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు మహానంది, పరమేష్, కరుణ, ఎంఆర్‌పిఎస్ నాయకులు మల్లికార్జున, రంగస్వామి, ఉరుకుందు, శ్రీరాములు, మల్లేష్, రంగన్న, బజారి, శ్రీనివాసులు, దస్తగిరి, తిప్పయ్య పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని ఆయన స్వగ్రామమైన తిమ్మాపురంలో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపడంతో మాదిగల కల సాకారం అవుతుందని హర్షం వ్యక్తం చేశారు. మాదిగల ఉపకులాలకు ఉద్యోగ, విద్య, రాజకీయంగా, బ్యాక్‌లాగ్ పోస్టులకు అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటామని చెప్పారు. **ఎమ్మిగనూరు**లో టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై వైసిపి గోడమీద పిల్లిలా వ్యవహరించిందని, దళితుల సంక్షేమాన్ని వైసిపి నాడు గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు కోసం ఆర్డినెన్స్ తీసుకురావడం వల్ల దేశంలోనే దాన్ని అమలు చేసిన తొలి వ్యక్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనత దక్కుతుందని పేర్కొన్నారు.


ఆదోనిలో డప్పులతో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు


ఆస్పరిలో చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు





అవశేషాలు కాల్చడం వల్ల పోషకాలు నష్టపోతాయి

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

- పంట అవశేషాల నిర్వహణ, సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల పోషకాలు నష్టపోతాయని, తద్వారా భూసారం తగ్గుతుందని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. వివిధ రకాల పంటల సాగు పూర్తయిన తర్వాత పంట అవశేషాలను కాల్చడం అనేది రైతులకు ప్రధాన సమస్య అని, ఇది పర్యావరణ, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. వాయు కాలుష్యం గణనీయంగా పెంచుతుందని తెలిపారు. వీటి గురించి ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మహ్మద్ ఖాద్రీ మాటల్లో...


పంట అవశేషాలను తగులబెడుతున్న దృశ్యం


ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

వాయు కాలుష్యం, భూసార క్షీణత

పంట అవశేషాలను కాల్చడం వల్ల గాలిలో కాలుష్య కణాలు విడుదల అవుతాయి. ఇవి గాలి నాణ్యతను తగ్గిస్తాయి. శ్వాసకోశ వ్యాధులకు కారణం అవుతాయి. అవశేషాలు కాల్చడం వల్ల నేల పోషకాలు నష్టపోతాయి. తద్వారా భూసారం తగ్గుతుంది.

ఆరోగ్య సమస్యలు, వాతావరణ మార్పులు

గాలి కాలుష్య కణాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమైనవి. శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలకు కారణం కావొచ్చు. పంట అవశేషాలు కాల్చడం వల్ల గ్రీన్ హౌస్ వాయువులు విడుదల అవుతాయి. ఇవి వాతావరణ మార్పులకు దోహదపడుతాయి.

రైతుల అవలంబించాల్సిన పద్ధతులు

పంటల అవశేషాలను కాల్చడం బదులుగా, ఇతర పద్ధతులను అవలంబించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. పంట అవశేషాలను నేలలో కలపడం, నేల సారాన్ని పెంచడంతో పాటు వాతావరణ కాలుష్యం తగ్గిస్తుంది. పంట అవశేషాలను కుళ్లించి వాటిని నేలలో కలపడం ద్వారా నేల సారవంతం, పోషకాలను పెంచవచ్చు.

భూమిలో దున్నడం

పంట అవశేషాలను నేలలో దున్నడం ద్వారా, అవి వేగంగా భూమిలో కుళ్లిపోయి నేలలో కలిసిపోతాయి. దీని ద్వారా భూమి సారవంతం పెరుగుతుంది. ఈ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు భూసారం కోల్పోకుండా అవశేషాల సమస్యను తీర్చుకోవడంతో పాటు భూసారాన్ని మరింత పెంచుకోవచ్చు.

పరిశుభ్రత, నీటి సరఫరా తనిఖీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశుభ్రత, నీటి సరఫరాను మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం పట్టణంలోని 13వ వార్డులో పర్యటించి పరిశుభ్రత, నీటి సరఫరా అంశాలు తనిఖీ చేశారు. ఎఇలు మదన్ కుమార్, శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

కార్యకర్తలే పార్టీకి పునాది

- టిడిపిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్
- కార్యకర్తల సమక్షంలో శివ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలూరు

జెండా మోసే ప్రతి కార్యకర్తలూ పార్టీకి పునాది అని, అలాంటి నాయకులను, కార్యకర్తలను విస్మరిస్తే పుట్టగతులుండవని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆలూరులోని తమ నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సమక్షంలో వైకుంఠం శివ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి కార్యకర్తలు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పరి, దేవనకొండ మాజీ ఎంపిపిలు కృష్ణ యాదవ్, బిల్లేకల్ వెంకటేష్, రామచంద్ర నాయుడు, మాజీ జడ్‌పిటిసిలు ఉచ్చీరప్ప, కురువ జయరాం, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు చిన్నహ్యాట శేషగిరి, ఈరన్న గౌడ్, ముత్తుకూరు మల్లికార్జున, మండల కన్వీనర్ విజయభాస్కర్, షేక్షావలీ, బిఎస్ఎన్ఎల్ మెంబర్ అట్టేకల్ జీవన్ కుమార్, రాజశేఖర్, రహిమాన్, విష్ణు, శీనప్ప, ప్రవీణ్ ముందుగా వైకుంఠం శివ ప్రసాద్, జ్యోతి దంపతులను శాలువా కప్పి పూలమాలతో సన్మానించి భారీ కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా వైకుంఠం శివ ప్రసాద్ మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలకు అండగా ఉండేది ఒకేఒక్క కుటుంబమని, అది వైకుంఠం శివప్రసాద్ కుటుంబమని తెలిపారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, కూటమి నాయకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అందుబాటులో ఉంటానని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. గత ఐదేళ్ల రాక్షస పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇవ్వలేని నాయకులకు కాలం చెల్లే సమయం ఆసన్నమైందని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చినా టిడిపి జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని వాపోయారు. కార్యకర్తలకు ఇవ్వాల్సిన పోస్టుల్లో లంచాలు అడుగుతున్నట్లు సమాచారం వచ్చిందని, పార్టీ అధినేత అన్ని చూస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. టిడిపి నాయకులు అల్లారుదిన్నె మల్లయ్య, నరసి రెడ్డి, బలరాం చౌదరి, ఎంపిటిసి నరసన్న, ఎర్రిస్వామి, సిద్ధప్ప, వెంకట రాముడు, శ్రీధర్, మారుతి, పరశురాం, అఖిల్, విశ్వ, లింగ, నరసింహులు, షేక్షావలీ, ఈరన్న, సుదర్శన్, శీనప్ప, రాము, సవారి, మల్లికార్జున పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వైకుంఠం జ్యోతి, ప్రసాద్

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కోసిగి

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం భారీగా పట్టుబడింది. శుక్రవారం ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి మాట్లాడారు. కర్నూలు ఈఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్, వారి సిబ్బందికి రాబడిన సమాచారం మేరకు మాలపల్లి నుంచి కంబాలదిన్నె గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న మారెమ్మ దేవాలయం వెనుక వంక గుండా మట్టి రోడ్డులో టయోటా ఇన్నోవా కారులో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 3840 డిప్స్ 40 బాక్సులలో ఉన్న ఒరిజినల్ ఛాయిస్ కర్ణాటక మద్యం, టయోటా ఇన్నోవా కారు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మద్యం విలువ సుమారు రూ.3,53,600 ఉంటుందని తెలిపారు. మద్యం తరలిస్తున్న నిందితులు గుడుగుడు గోవింద, పోలి వీరేష్, మజ్జిగ బొజ్జప్ప, బోయ బాలు, ఆదోని శివశంకర్, బోయ హుస్సేనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ కెఆర్.రాజేంద్రప్రసాద్, కోసిగి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర, పి అండ్ ఇహెచ్‌సి కిషోర్, పి అండ్ ఇసి భరత్, రవి కుమార్, మునిరంగడు, కర్నూలు సిబ్బంది సాయిబాబా, మధు, లాలు, కుమార్ స్వామి, రెడ్డి పాల్గొన్నారు.


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు